ఉల్లాసంగా ఉగాది

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వేదపండితుల పంచాంగ పఠనం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు..
- భద్రేశ్వరస్వామి జాతరకు అంకురార్పణ

పరిగిలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ పఠనంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు: పంచాంగం వింటున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 9: తాండూరు నియోజకవర్గంలో ప్రజలు మంగళవారం ఉగాది పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. తాండూరు పట్టణంతో పాటు తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లోని పల్లెల్లో ప్రత్యేకమైన ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తీపి వంటకాలు చేసి దేవుడికి నైవేద్యం పెట్టిన అనంతరం కుటుంబంతో పాటు బంధుమిత్రులు కలిసి పచ్చడి తాగి తీపి వంటకాలను ఆరగించారు. రైతులు తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా పొలాల్లో పూజలు చేసి దుక్కులు దున్నడాన్ని ప్రారంభించారు. తాండూరు శ్రీభావిగి భద్రేశ్వర దేవాలయం, కాళికాదేవి ఆలయం, పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయం, రేణుకా ఎల్లమ్మ దేవాలయం, కట్టమైసమ్మ దేవాలయం, భవానీమాత దేవాలయం, కోకట్ రోడ్డు మార్గంలోని సాయి బాబా దేవాలయంతో పాటు నియోజకవర్గంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో వేద పండితులు పంచాంగం చదివి వినిపించారు. ప్రజలకు షడ్రుచుల ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. తాండూరు పట్టణంలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8 వ తేదీ వరకు జరుగనున్న శ్రీభావిగి భద్రేశ్వర స్వామి జాతరకు మంగళవారం అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సావాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవ చక్రాలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, దేవస్థానం కార్యనిర్వహణ అధికారులు, ఆల యక మిటీ ప్రతినిధులతో పాటు తాండూరు పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కరపత్రాలు, వాల్ పోస్టర్లను విడుదల చేశారు.



పెద్దేముల్ : జనగాం గ్రామంలో



కులకచర్ల మండలం మందిపల్ గ్రామంలో ..

పరిగి: పరిగి పట్టణంలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం, బహార్‌పేట్ హనుమాన్ మందిర్‌లో మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా శ్రీ క్రోధినామ సంవత్సరంలో వివిధ రాశుల వారికి కలిగే శుభాలను వివరించారు. పరిగిలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పంచాంగ పఠనంలో స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాలపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ప్రజలు కొత్త బట్టలు ధరించి దేవాలయాలకు వెళ్లి పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బొంరాస్‌పేటలో పురోహితుడు జోషి శ్రీనివాస్‌రావు పంచాంగ పఠనం చేశారు. కొత్త ఏడాదిలో రాశిఫలాలు, వర్షాకాలం ఎలా ఉంటుందో ఆయన వివరించారు. అనంతరం పచ్చడి పంపిణీ చేశారు. నూతన సంవత్సరం కావడంతో ప్రజలు కొత్తగా ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దుద్యాలలో యువకులు అడుగుల భజన, జడకొప్పు ఆటను ప్రదర్శించారు. పలు గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు.

వికారాబాద్: గ్రామాల్లోని హనుమాన్ దేవాలయం, శివాలయాలు, శ్రీ రామ మందిరంలో పంచాంగాన్ని ఆలయ అర్చకులు వినిపించారు. ఆలయాల్లో అన్ని రాశుల వారికి జరుగబోయే విషయాలు వివరించారు. అనంతరం ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పచ్చడిని పంపిణీ చేశారు.

కులకచర్ల : కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఉగాది పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రా మంలో పురోహితుడు మఠం రాజశేఖర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వికారాబాద్ పట్టణంలో ..

బొంరాస్‌పేటలో పంచాంగ పఠనం చేస్తున్న శ్రీనివాస్‌రావు

చలివేంద్రాలు ప్రారంభం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినం సందర్భంగా దుద్యాల స్టేజీ వద్ద మంగళవారం దుర్గా భవానీ దాబా నిర్వాహకుడు మ్యాకం ప్రభాకర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి ఏటా మ్యాకం లక్ష్మమ్మ, నారాయణ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తాండూరు, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా ప్రజలకు ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిరోజూ ఉచితంగా మంచినీళ్లు అందించేందుకు మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

డబ్బు కొట్టేసిన వ్యక్తి అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9: పెట్రోల్ బంక్ ఉద్యోగి నుంచి డబ్బు కొట్టేసిన వ్యక్తిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ గ్యార జగన్ వివరాలను వెల్లడించారు. షాపూర్‌నగర్ నివాసి మహమ్మద్ సాబిల్ (33) ర్యాపిడో డ్రైవర్. మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర దురలవాట్లకు బానిసయ్యాడు. సాబిల్ సంపాదించే సొమ్ము అతడి అవసరాలకు సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు ప్రణాళికలు రచించాడు. ఇందులో భాగంగా ఈ నెల 5న రాత్రి పదిన్నర గంటల సమయంలో మాణికేశ్వరీనగర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పనిచేసే సుమిత్‌రాయ్ వద్దకు బైక్‌పై వచ్చి.. తనకు అత్యవసరంగా రూ.20 వేలు అవసరం ఉన్నదని చెప్పాడు. తనకు రూ.20 వేలు ఆన్‌లైన్‌లో పంపిస్తే, అంత మొత్తం నగదు వెంటనే ఇచ్చేస్తానన్నారు. దీంతో సుమిత్‌రాయ్ తన మొబైల్ నుంచి ఫోన్ పే ద్వారా సాబిల్ చెప్పిన నంబర్‌కు సొమ్ము పంపించాడు. వెంటనే అక్కడి నుంచి తప్పించుకునేందుకు సాబిల్ ప్రయత్నించాడు. బైక్‌ను ఆపేందుకు సుమిత్‌రాయ్ ప్రయత్నించి, కిందపడి గాయాలపాలయ్యాడు. సుమిత్‌రాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హబ్సిగూడలో అనుమానాస్పదంగా కనిపించిన సాబిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, తప్పును ఒప్పుకోవడంతో అతడిని అరెస్టు చేశారు. సాబిల్ నుంచి రూ.20 వేల నగదుతో పాటు, హోండా యూనికార్న్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ డివిజన్ ఏసీపీ గ్యార జగన్

అనాథాశ్రమంలో బాలిక ఆత్మహత్య

దుండిగల్,ఏప్రిల్ 9: అనాథాశ్రమంలో అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన నీలం సతీష్ కూతురు వైష్ణవి (13) దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్ అనాథాశ్రమంలో ఉంటూ.. అక్కడే 6వ తరగతి చదువుతున్నది. బాలిక తండ్రి రెండేండ్ల కిందటే అనారోగ్యంతో మరణించగా, తల్లి చిన్నప్పుడే కుటుంబాన్ని విడిచి వెళ్లిపోయింది. దీంతో అనాథగా మారిన వైష్ణవిని తన మేనత్త చేరదీసి.. దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్ అనాథాశ్రమంలో చేర్పించింది. అయితే, ఈ నెల 5న మేనత్త కూతురి పెండ్లి ఉండటంతో 3వ తేదీన సూరారం కాలనీకి వచ్చింది. తిరిగి సోమవారం (8వ తేదీన) మధ్యాహ్నం మేనత్త దంపతులు వైష్ణవిని ఆశ్రమంలో చేర్పించి, ఇంటికి వెళ్లిపోయారు. అయితే, ఆశ్రమంలో చేరిన కొద్ది సేపటికే వైష్ణవి తన గదిలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మేనత్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైష్ణవి ఆత్మహత్యకు గల కారణాలు ఇంత వరకు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి..

11 తులాల బంగారం, 50 తులాల వెండి చోరీ

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 9: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు ఎత్తుకు పోయారు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.. లక్ష్మీగూడ నివాసి శర్మ ప్రైవేట్ ఉద్యోగి. కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పనికి వెళ్లారు. శర్మ భార్య సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగులగొట్టి ఉంది. ఇంటి లోనికి వెళ్లి చూడగా.. అల్మారాలోని బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే అల్మారాలో దాచిన బంగారం, వెండి, నగదును పరిశీలించగా.. అవి కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని గ్రహించి.. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. 11 తులాల బంగారం, 50 తులాల వెండితో పాటు నగదు పోయినట్టు గుర్తించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర బైలాట

బొంరాస్‌పేట, ఏప్రిల్ 9 : మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో ఈ నెల 1వ తేదీ నుంచి ప్రదర్శించిన శ్రీ సత్యహరిశ్చంద్ర బైలాట ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. బైలాటలోని పలు సన్నివేశాలను కళాకారులు కండ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పాత్రధారులు పాడిన పాటలు, నటన, వస్త్రాలంకరణ, స్టేజీ అలంకరణ ప్రేక్షకులను ఆకట్టుకున్నది. మదన్‌పల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు బైలాటను తిలకించారు.

హోర్డింగ్ కూలిపోయి ఇద్దరికి గాయాలు

ఎంపీఎం స్క్వేర్ మాల్ యాజమాన్యంపై కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9: హోర్డింగ్ కూలిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని ఎంపీఎం స్క్వేర్ మాల్ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. నాగార్జున సర్కిల్ వద్ద ఉన్న ఎంపీఎం స్క్వేర్ మాల్‌కు చెందిన ఓ హోర్డింగ్ సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో వచ్చిన పెనుగాలులకు కింద పడిపోయింది. అదే సమయంలో ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న సూరజ్ కుమార్, పర్వేష్ అనే వ్యక్తులపై హోర్డింగ్ పడటంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని నిమ్స్ ఆస్పత్రిలో చేర్చి.. చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుల స్నేహితుడు భువల్ కుమార్ సోమవారం అర్ధరాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, హోర్డింగ్ ఏర్పాటులో సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైన మాల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అడ్వర్టయిజింగ్ విభాగం ఏఈ అభిలాష్ ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది.

శ్రీరామ అవతారంలో శ్రీవేంకటేశ్వరుడు..

కొడంగల్, ఏప్రిల్ 9: కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 44వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీనివాసుడిని రామావతారంలో అలంకరించి హనుమంత వాహనంపై తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. ఉగాది పర్వదినాన్ని పుర స్కరించుకొని ఆలయంలోని ఆస్థమ మండపంలో నూతన పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మామిడి ఆకుల కోసం వెళ్లి .. విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

పెద్దేముల్, ఏప్రిల్ 9 : ఉగాది పండుగ ఉన్నదని మామిడి ఆకుల కోసం వెళ్లగా కరెంట్ వైరు తగిలి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గాజీపూర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ గిరి కథనం ప్రకారం.. పెద్దేముల్ మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన ఈడిగి రాములు గౌడ్ సోమవారం సాయంత్రం మామిడి ఆకులను తెంపుకొని తిరిగి వస్తున్న క్రమంలో కంచెను దాటుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడే చనిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఆయన తమ్ముడు లక్ష్మయ్య గౌడ్ అటుగా వెళ్తూ గమనించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇప్పటి వరకు 12.87కోట్ల నగదు సీజ్!

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇప్పటి వరకు రూ.12.87 కోట్ల కోట్ల మేర నగదును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. రూ.కోటి 86 లక్షల విలువజేసే ఇతర వస్తువులు, 19,798 లీటర్ల అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు. 146 కేసులు నమోదు చేసి, 140 మందిని అరెస్ట్ చేశామన్నారు. నగదు ఇతర వస్తువులపై 5 ఫిర్యాదులు రాగా, పరిశీలించి పరిష్కరించామన్నారు. నలుగురిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేశారని, 29 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేశారని జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు.

ఆలుగడ్డ బావి వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు

30 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఎంఎంటీఎస్ ఫేస్ ట్రాక్-2 ట్రాఫిక్ కనెక్టివిటీ పనులలో భాగంగా సీతాఫల్‌మండి-లాలాగూడ మధ్యలో ఇన్నర్ రింగ్‌లోని ఆలుగడ్డబావి వద్ద ఆర్‌యూబీ 1బి(మెట్టుగూడ -చిలకలగూడ) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో 10వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు 30 రోజుల పాటు ఆర్‌యూబీ1ఏ నుంచి మాత్రమే ట్రాఫిక్‌ను అనుమతిస్తామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తార్నాక, లాలాగూడ వైపు నుంచి సికింద్రాబాద్‌కు సంగీత్ క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్‌ను వాడుకోవాలని, మల్కాజిగిరి, మీర్జాలగూడ, లాలాగూడ నుంచి సంగీత్ క్రాస్‌రోడ్స్ వెళ్లేవారు తుకారాంగేట్ ఆర్‌యూబీ, వెస్ట్‌మారేడ్‌పల్లి సెయింట్ జాన్ రోటరీ మీదుగా వెళ్లాలని సీపీ సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వీరంగం

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9: డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు వీరంగం సృష్టించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో టోలీచౌకి ట్రాఫిక్ పోలీసులు స్థానికంగా ఉన్న ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అదే సమయంలో అటువైపు తెల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి బైక్‌పై వచ్చాడు. అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా అడ్డుకోవడంతో పాటు న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. సుమారు గంటపాటు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగి.. నోటికి వచ్చినట్లు మాట్లాడాడు. ఎట్టకేలకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా.. 98 ఎంజీడీగా నమోదైంది. విధులకు ఆటంకం కలిగించడంతోపాటు న్యూసెన్స్‌కు పాల్పడిన శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ట్రాఫిక్ ఎస్ఐ ప్రేమ్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిద్రించే స్థలం విషయంలో గొడవ.. హత్య

పహాడీషరీఫ్, ఏప్రిల్ 9: నిద్రించే స్థలం విషయంలో తలెత్తిన వివాదం హత్యకు దారి తీసింది. పహాడీషరీఫ్ పోలీసుల కథనం ప్రకారం.. కామ్‌సింగ్ (40) క్యాటరింగ్ కార్మికుడు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న పోచమ్మ గుడి ఆవరణలో సోమవారం రాత్రి నిద్రించాడు. ఆటోడ్రైవర్ నవంత్ (40) అక్కడే నిద్రించేందుకు వచ్చి స్థలం విషయంలో కామ్‌సింగ్‌తో గొడవపడ్డాడు. కోపంతో కర్రతో దాడి చేయడంతో కామ్‌సింగ్ చనిపోయాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం..

పెద్దేముల్, ఏప్రిల్ 9 : మండల పరిధిలోని మంబాపూర్ గ్రామానికి చెందిన యాసని లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందింది. అదే విధంగా వడ్డే ఎల్లప్ప కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్దేముల్ ఎఫ్ఎస్ఎస్ఎస్ డైరెక్టర్ నారాయణ రెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పాడు. ఆ రెండు కుటుంబాలకు తన వంతు సాయంగా చెరి ఐదువేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.మైపూజ్, యాదప్ప శ్రీను, దస్తప్ప, ఎల్లప్ప, రాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తెలుగు ఉగాది మరాఠాల గుడీపడవా

షడ్రుచులతో తెలుగు ఉగాది జరిగినట్టుగానే.. నగరంలోని మరాఠాలు కూడా గుడీపడవా పర్వదినాన్ని సంబురంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగానే కొండాపూర్‌లోని సీసీఆర్‌టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ ఆండ్ ట్రైనింగ్)లో మహారాష్ట్రీయులు మంగళ వారం నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్, బిజినేపల్లి/నుమోశ్వరం } 80966 77668 : 80966 77962